
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



విజయనగరం

జిల్లా వార్తలు


సోమవారం 29 ఏప్రిల్ 2024



కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన(ఫైల్)

ఉద్యోగుల సమస్యలను సీఎం జగన్ గాలికివదిలేశారు. సకాలంలో వేతనాలు అందక.. సమగ్రమైన పీఆర్సీకి నోచుకోక... మెడికల్, ఇతర బిల్లులూ దక్కక వారు తీవ్ర నిరాశతో నెట్టుకొచ్చారు. ఉద్యోగ సంఘం నేతలు తమ సమస్యలపై సీఎం కలిసి విన్నవించుకుందామన్నా దర్శనం దొరికేది కాదు. 2019 ఎన్నికలకు ముందు ఉద్యోగులపై ప్రేమ కురిపించిన ఆయన అధికారంలోకి వచ్చాక దగ్గరకు రానివ్వలేదు. ఈ ఐదేళ్లూ ఉద్యోగవర్గాలు ఉద్యమాలతోనే నెట్టుకువచ్చాయి. కలెక్టరేట్ నిత్యం నిరసనలతో అట్టుడుకేది. విజయనగరం ఆందోళనకారులతో నిండిపోయేది.

- కలెక్టరేట్, ఏప్రిల్ 28



ఐదేళ్లూ వేతన యాతనే..



- జీతం కోసం ప్రతినెలా రోడ్డెక్కిన ఉద్యోగులు
- పీఆర్సీ అమలు కోసమూ ఉద్యమం
- రావాల్సిన బిల్లులూ అందక అవస్థలు
- కలెక్టరేట్ వద్ద నిత్యం నిరసన శిబిరాలు
- ఇప్పటి మేనిఫెస్టోలోనూ మభ్యపెట్టే యత్నం

వైసీపీ ప్రభుత్వంలో ఏ ప్రభుత్వ ఉద్యోగి కూడా సకాలంలో వేతనం పొందిన పరిస్థితి లేదు. పదో తేదీ వచ్చినా జీతం పడుతుందో లేదోనన్న దిగులుతోనే కనిపించేవారు. జీతాలు ఇప్పించండి మహాప్రభో అంటూ ఉద్యోగులు అనేకసార్లు ఆందోళనలు చేశారు. ప్రతి నెలా ' ప్రభుత్వానికి అప్పు పుట్టిందా.. ఈ నెల మనకు జీతం అందుతుందా" అంటూ ఉద్యోగులు సామాజిక మాధ్యమాల్లో చర్చలు పెట్టిన దుస్థితి ప్రతినెలా కొనసాగింది. పింఛన్ల పరిస్థితి వర్ణనాతీతం. మందులు కొనుక్కోవడానికి పండుటాకులు అల్లాడిపోయేవారు. జీతాలు ఇప్పించే ఒదుకు చట్టం చేయాలంటూ ఉద్యోగుల సంఘం ఏకం గా గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చింది. ఇలాంటి దుస్థితి ఏ ప్రభుత్వ హయాంలోనూ రాలేదు. ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్ పెట్టేవారు. ఉద్యో గుల జీతాల నుంచి మినహాయించిన సీపీఎస్ మొత్తాన్ని ప్రాన్‌ఖాతాకు జమ చేసేవారు కాదు. ఇలా అనేక బిల్లులను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. ఆఖరుకు రిటైర్ అయిన ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలను కూడా పూర్తిగా అందించే పరిస్థితి లేదు.

- జిల్లా వ్యాప్తంగా సుమారు 30 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. వారిలో ఎక్కువ ఉంది ఉపాధ్యాయులే. వీరికి ప్రతి నెల జీతం అందకపోవడంతో పాటు ఏపీజీఎల్ఐ, పీఎఫ్, సరెండర్ లీవులు వంటి ఆర్థిక పరమైన సమస్యల పరిష్కారం కోసం అనేక సార్లు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. పెన్షనర్లు కూడా ప్రతి నెల ఒకటో తేదీన పెన్షన్ డబ్బులు అందకపోవడంతో మండల, కలెక్టరేట్ కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేశారు.
- సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగారు. సాంఘిక సంక్షేమ గురుకులల్లో పనిచేస్తున్న సిబ్బందికి రెండు నెలలుగా, డీ అడిక్షన్ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి తొమ్మిది నెలలుగా జీతాలు లేవు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు కూడా చాలా మంది జీతాలు సకాలంలో రాక ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ, మున్సిపల్ కార్మికులదీ అదే దుస్థితి.
- ఉద్యోగుల సమస్యలపై సంఘాల నాయకులను ప్రభుత్వం చర్చలకు పిలిపించడం.. ఏమీ తేల్చకుండా పంపించేయడం జరిగేది.
- పీఆర్సీ అమలులో జగన్ సర్కారు చేసిన అన్యాయంపై 2022 ఫిబ్రవరి 3న ఉద్యోగులు నిర్వహించిన గర్జన ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టించింది. దీంతో దిగొచ్చిన ప్రభుత్వం కొన్ని సదుపాయాలు కల్పించి ఉద్యమాన్ని అణచివేసే ఎత్తుగడకు దిగింది. ఉద్యోగుల సంఘాన్ని వేరు చేయాలని నిర్ణయించి విభజించు.. పాలించు సూత్రాన్ని అమలు చేసింది.
- 2019 ఎన్నికలకు ముందు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామన్న హామీతో వారిలో ఆశలు కల్పించారు. తీరా అధికారంలోకి వచ్చాక నిబంధనల సాకును చూపి కొద్దిమందినే క్రమబద్ధీకరించారు. అది కూడా ఎన్నికల ముందు చేశారు.
- వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో చూసిన ఉద్యోగులు, పెన్షనర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల ఎటువంటి మేలు చేయకపోయినా ఏదేదో చేశామని చెప్పుకోవడం సరికాదంటున్నారు. అలాగే ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగులూ నిరసన బాట పట్టారు. విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యూలర్ చేయకపో వడంతో వారు కూడా ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.



సమగ్ర శిక్ష ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ (ఫైల్)

న్యాయం జరగలేదు..

ఈ ఐదేళ్లలో ఉద్యోగులు, పెన్షర్లకు ఎటువంటి న్యాయం జరగలేదు. ఏ ప్రభుత్వం ఇటువంటి నిరంకుశ విధానాలు అవలంభించలేదు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పింఛను విధానం అమలు చేస్తామని పాదయాత్రలో హామీ ఇచ్చారు. ఆఖరుకు జీపీఎస్ విధానం తెచ్చారు. ఇటువంటి పరిస్థితిలో ఉద్యోగులు,పెన్షనర్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

-ఓ రిటైర్డ్ తహసీల్దార్ వేదన

రెగ్యులర్ చేయలేదు..

జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయలేదు. గత ఎన్నికల ప్రచారంలో రెగ్యులర్ చేస్తామని ప్రకటించారు అమలు కాలేదు. జిల్లా వ్యాప్తంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకూ న్యాయం జరగలేదు. సమగ్రశిక్షలో పని చేస్తున్న ఉద్యోగులు సుమారు నెల రోజుల పాటు ఆందోళన చేసినా పట్టించుకోలేదు.

-ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి నిరాశ

సరైన హామీ లేదు..

వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఎక్కడా ఉద్యోగాల భర్తీ గురించి లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినా ఉపయోగం లేకపోయింది. ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి ఎన్నికల ముందు నోటిఫికేషన్ ఇచ్చారు. గ్రూప్స్ పోస్టులూ అంతే. జిల్లాలోని నిరుద్యోగులంతా నిరాశలో ఉన్నారు.

-ఓ నిరుద్యోగి ఆవేదన

దోపిడీయే.. అభివృద్ధి ఏదీ?

- సెక్రటేరియేట్‌నూ జగన్ తాకట్టు పెట్టేశారు
- టీడీపీ సీనియర్ నేత అశోక్‌గజపతిరాజు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 28: రాష్ట్రంలో దోపిడీ తప్ప.. అభివృద్ధి లేదని ప్రజలు ఆలోచించి రానున్న ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులకు ఓటేయాలని టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు కోరారు. పుచ్చలవీధి జంక్షన్, ఫూల్‌బాగ్‌లోని కోర్టు జంక్షన్‌లో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు పాతబస్టాండ్, సంతపేట, నాగవంశంవీధితో పాటు 2, 3, 4 డివిజన్లలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారన్నారు. రాష్ట్ర సెక్రటేరియేట్‌ను కూడా జగన్ తాకట్టు పెట్టేశారంటే పరిస్థితి ఏ విధంగా వుందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ప్రాథమిక విద్య వైద్యం అందని ద్రాక్షలా మిగిలాయన్నారు. ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మంది బడికి దూరం అయ్యారన్నారు. భావితరాలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలంటే రానున్న ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమిని గెలిపించాలని పిలుపు నిచ్చారు. ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు మాట్లాడుతూ అన్ని రకాలుగా ఇబ్బందుల్లో వున్న రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లాలంటే చంద్రబాబు లాంటి సమర్థవంతమైన నాయకుడు అవసరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, ప్రసాదుల ప్రసాద్, కాళ్ల గౌరీశంకర్, అవనాపు విజయ్, అవనాపు భార్గవి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం రథంపై మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు

ప్రణాళికాబద్ధంగా రిసెప్షన్ సెంటర్లు

- సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, ఏప్రిల్ 28: పోలింగ్ అయ్యాక ఈవీఎంలను భద్రపరచడంతో పాటు కౌంటింగ్ ప్రక్రియ జరిగే రిసెప్షన్ సెంటర్లలో ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా ఉండాలని, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. రిసెప్షన్ సెంటర్ సిబ్బందికి కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం శిక్షణ నిర్వహించారు. కౌంటర్ల ఏర్పాట్లు, విధులు, సదుపాయాలు, పార్కింగ్ తదితర అంశాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి వారిని ఎన్నికలకు సిద్ధం చేయాలని సూచించారు. రోజంతా ఎంతో కష్టపడి ఎన్నికల విధులను నిర్వహించి ఈవీఎం, ఇతర సామగ్రితో తిరిగి వచ్చే సిబ్బంది ఎక్కడా ఇబ్బంది పడకుండా రిసెప్షన్ సెంటర్లలో ఏర్పాట్లు ఉండాలని చెప్పారు. పీవోలు, ఏపీవోలు, ఇతర సిబ్బంది బస్సుల్లో నుంచి దిగగానే తాము వెళ్లాల్సిన కౌంటర్లకు సులువుగా చేరుకునేలా డైరెక్షన్ బోర్డులు, నేమ్ బోర్డులు ఉండాలని సూచించారు. ఒక్కో నియోజకవర్గానికి సుమారు 10 నుచి 12 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడే ఈవీఎంలను, ముఖ్యమైన పత్రాలను అందజేయాల్సి ఉందన్నారు. సాధారణ కేంద్రాల్లో ఇతర సామగ్రి సమర్పించాలని చెప్పారు. ప్రత్యేక కౌంటర్‌లో నలుగురు సిబ్బంది, ఇద్దరు సహాయకులు, ఈవీఎంలను స్ట్రాంగ్ రూములకు తలించేందుకు మరో ఇద్దరు సహాయకులు ఉంటారని చెప్పారు.

రిసెప్షన్ సెంటర్లకు ఇన్‌చార్జుల నియామకం

ఒక్కో రిసెప్షన్ సెంటర్‌కు ఇద్దరు జిల్లా అధికారులను ఇన్‌చార్జులుగా నియమించామని కలెక్టర్ తెలిపారు. విజయనగరం, బొబ్బిలి అసెంబ్లీ స్థానాల ఓట్లు లెక్కింపు జరిగే జెఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం రిసెప్షన్ సెంటర్లకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, జడ్పీ సీఈవో రాజకుమార్, మిగిలిన అసెంబ్లీ స్థానాల లెక్కింపు జరిగే లెండి కళాశాలకు మెప్మా పీడీ సుధాకర్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావును నియమించినట్లు తెలిపారు. ఓటర్ల వివరాలను అక్కడే సమర్పించాలని, పరిశీలకుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.





వారికైతే ఒకే..

- అధికార పార్టీ నేత ఆదేశంతో నేటికీ మద్యం అక్రమ రవాణా!
- సహకరిస్తున్న దుకాణాల సిబ్బంది
- అప్పుడప్పుడు బెడిసికొట్టి పట్టుబడుతున్న వైనం
- సీళ్లు తొలగించి పక్కదారి పట్టిస్తున్న మద్యం సిండికేట్

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

- గంట్యాడ మండలం కొటారుబిల్లి కూడలిలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో ఇటీవల అక్రమాలు బయట పడ్డాయి. మద్యం బాటిళ్ల మూతలపై వేసిన సీళ్ల తొల గించి నిల్వలను పక్కదారి పట్టిస్తున్న వైనాన్ని ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో ముగ్గురు సేల్స్‌మన్లను తొలగించారు.
- పూసపాటిరేగ మండలంలో ఇద్దరు సేల్స్‌మెన్లను అధికారులు తొలగించారు. వారు మద్యం నిల్వలను పక్కదారి పట్టిస్తున్నారన్నది ఆరోపణ. ఆ మద్యం నిల్వలు బెల్టు షాపులకు వెళ్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఇద్దరు సేల్స్‌మెన్లను విధుల నుంచి తొలగించారు.

మద్యం అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోందనడానికి ఈ రెండు ఉదాహరణలు మాత్రమే. ఎన్నికల్లో మద్యాన్ని ఓ ఆయుధంగా భావించిన అధికార పార్టీ నాయకులు దుకాణాల నుంచి చాకచక్యంగా తమ స్టాక్ సెంటర్‌కు తరలిస్తున్నారు. అందుకు దుకాణాల్లోని సిబ్బంది కమీషన్లకు కక్కుర్తి పడి సహకరిస్తున్నారు. నాయకుల సిఫార్సు మీదే ఉద్యోగాలు పొందిన కొందరు రుణం తీర్చుకోవడానికి వారు ఏం చెప్పినా అంగీకరిస్తున్నారు. కొన్నిసార్లు బెడిసికొట్టి అడ్డంగా దొరికిపోతున్నారు. అయితే ప్రతిపక్షాలకు చెందిన నాయకులు కాని, మద్దతుదారులు కాని ఫిర్యాదు ఇచ్చాకే ఎక్సైజ్ అధికారులు స్పందిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఏదైనాగాని కొన్నాళ్లుగా మద్యం నిల్వలను ప్రభుత్వ షాపుల్లో పనిచేస్తున్న సిబ్బందే పక్కదారి పట్టిస్తున్నారు. ఈ నిల్వల్లో కొన్ని బెల్టు షాపులకు వెళ్తున్నాయి.

ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించింది. గతేడాది ఇదే నెలలో అమ్మకాలు జరిగిన స్థాయిలోనే ఇప్పుడూ సాగాలని, ఎక్కువ అమ్మకాలు చేయకూడదని ఆదేశించింది. అలాగే షాపులు తెరిచి ఉంచే సమయం కూడా కుదించింది. ఉదయం 11గంటల నుంచి రాత్రి 9గంటల వరకు మాత్రమే షాపులు తెరవాలని చెప్పింది. వాస్తవంగా ఈ సమయానికి ముందే ఆయా దుకాణాల అమ్మకాల కోటా ముగుస్తోంది. ప్రత్యేక దారిలో మద్యం తరలుతుండడంతో నిబంధనలు మొక్కుబడిగా మిగిలాయి. మందుబాబులు చేసేదిలేక బెల్ట్‌షాపులను ఆశ్రయిస్తున్నారు. వారేమో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు.

సీళ్లు తొలగించి..

కొన్ని చోట్ల లభ్యం అవుతున్న మద్యం నిల్వలపై సీళ్ల ఉండడం లేదు. అంటే సీళ్ల తొలగించి ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి నిల్వలను తప్పుతోవ పట్టిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారుల దర్యాప్తుల్లో కూడా తేలింది. అంటే సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు తెలివిగా వ్యవహరించి నిల్వలను పక్కదారి పట్టిస్తున్నారు. సీళ్ల తొలగిస్తే దానిపై ఉండే స్కానింగ్ కోడ్ నెంబరు, బ్యాచ్ నెంబరు వంటివి పోతాయి. దీనివల్ల పట్టబడుతున్న నిల్వలు ఏ షాపునుంచి తరలిందీ గుర్తించడం కష్టం.

ముందు నుంచే మద్యం వ్యూహం

గతేడాది డిసెంబరు 26 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 19వరకు అంటే సుమారు నాలుగు నెలల్లో ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న వారు నాయకుల అడుగుజాడల్లోనే నడిచారు. ఎన్నికలకు చాలా ముందు నుంచే నాయకులు మద్యం వ్యూహం అమలు చేశారు. ఈ తంతులో సిబ్బంది పావులుగా మిగిలారు. ఈ వ్యవధిలో ముగ్గురు సూపర్‌వైజర్లు, 10మంది సేల్స్ మెన్లు తొలగింపునకు గురయ్యారు.



విజయనగరం: ప్రభుత్వ వైన్‌మార్ట్‌లో ఖాళీ అయిన మద్యం నిల్వలు

ఓ అధికారికి కాసులే కాసులు



విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో మద్యం వినియోగం తగ్గించాలన్న ఆలోచనతో ఇండెంట్ పెట్టే అవకాశం షాపులకు లేకుండా ఈసీ నియంత్రించింది. ఉన్నతాధికారులే ఏఏ బ్రాండ్ల మద్యం.. ఎంతెంత అవసరమో గుర్తించాలని చెప్పింది. ఈ ఆదేశం జిల్లాలోని ఓ ఎక్సైజ్ అధికారికి కాసులు తెచ్చిపెడుతోంది. జిల్లాలో ఏ ప్రభుత్వ మద్యం షాపుకైనా.. ప్రైవేట్ బార్లుకు అయినా అతనే ఇండెంట్ పెడుతున్నారు. మద్యం సిండికేట్‌లతో చేతులు కలిపి రెండుచేతులా సంపాదిస్తున్నారు. కాగా కూలీలు, కార్మికులు సేవించే తక్కువ ధర మద్యం కేవలం బార్లులో మాత్రమే లభించడం గమనార్హం. మద్యం ప్రియులకు వేసవి తాపాన్ని తగ్గించే బ్రాండెడ్ బీర్లు కూడా బార్లుకే ఎక్కువగా సరఫరా చేస్తున్నారు. మద్యం దుకాణాలకు మాత్రం అంతంతమాత్రంగా ఇండెంట్ పెడుతున్నారు. వైన్ షాపులకు నెలలో కేవలం 5 నుంచి 10 కేసులు మాత్రమే బ్రాండెడ్ బీర్లు పంపిస్తున్నారని, మిగిలిన సరుకల్లా బార్లుకు తరలిస్తున్నారని సమాచారం. విధులో చేరి ఏడాది గడవక ముందే ఓ కీలక ఎక్సైజ్ అధికారి రాజకీయ పెద్దలతో పరిచయాలు పెంచుకుని రెండుచేతులా దోచేస్తున్నారని ఆ శాఖ ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆ అధికారి మద్యం సిండికేట్ల నుంచి ఫోన్ రాగానే ఇండెంట్ రెడీచేసి వారికి కావాల్సిన సరుకు పంపిస్తున్నారని తెలుస్తోంది.

- మద్యం సిండికేట్‌తో మిలాఖత్

- పొద్దంతా కష్టపడి సాయంత్రం క్వాటర్ కొనుక్కునేందుకు వైన్ షాపునకు వెళ్లే కార్మికునికి రేట్లు చూసి కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. క్వాటర్ ధర రూ.400 నుంచి రూ.700 చెబుతున్నారు. అదే బారుకు వెళ్తే తక్కువ ధర మద్యం క్వాటర్ బాటిళ్ల కూడా అక్కడ దొరుకుతున్నాయి. అయితే క్వాటర్‌పై రూ.50 నుంచి రూ.60 అధికంగా వసూలు చేస్తున్నారు. జిల్లాలో ఆ ఎక్సైజ్ అధికారి తీరుతో సాయంత్రం అయ్యేసరికి వైన్‌షాపులు నిల్‌గా, బార్లు మద్యంప్రియులతో ఫుల్‌గా కనిపిస్తున్నాయి.

పీపుల్స్ మేనిఫెస్టో

ఉచిత పథకాలు ఎవరడిగారు?



గరుగుబిల్లి: ఉచిత పథకాలు కావాలని ప్రజలు ఎవరైనా అడిగారా? అధికారంలోకి వచ్చేందుకు పథకాల పేరుతో ప్రజల నెత్తిన భారం పెడుతున్నారు. ప్రజలకు ఉచితంగా ఇవ్వాల్సిన వాటిని ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉచిత పథకాలతో ప్రజలపై పెనుభారం పడుతోంది. ఉచిత పథకాలతో ప్రభుత్వం అప్పుల పాలై.. వాటిని తీర్చేందుకు పన్నుల రూపంలో ప్రజలపై భారం పెడుతుంది. ప్రజలపై మోయలేని భారం మోపడం ప్రభుత్వాలకు తగదు. ప్రజలకు, ప్రభుత్వానికి భారం కాకుండా సంక్షేమం అమలు చేయాలి. అధికారంలోకి వచ్చేందుకు పథకాలతో మోసం చేసే పార్టీలకు మద్దతు ఇవ్వం.

- గొట్టాపు కృష్ణమూర్తి,
గొట్టివలస, గరుగుబిల్లి మండలం

బేబీనాయన ఉరఫ్ ఆర్‌వీఎస్‌కేకే రంగారావు

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ స్థానానికి తెలుగుదేశం-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో దిగుతున్న బేబీనాయన అసలు పేరేమిటో అత్యధిక శాతం ఓటర్లకు తెలియదు. అందరికీ ఆయన బేబీనాయనగానే తెలుసు. ఇప్పుడు అసలు పేరు జనాల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు తలమునకలయ్యారు. బేబీనాయనతో బాగా సన్నిహితంగా మెలిగేవారు సైతం ఆయన పేరును వెంటనే చెప్పలేని పరిస్థితి ఉంది. మే లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా బ్యాలెట్ పేపర్లలో, ఈవీఎంలలో బేబీనాయన అనే పేరు కనిపించదు. దీనితో కొంతమంది ఓటర్లు కంగారు పడే అవకాశం ఉన్నందున ఆయన పూర్తి పేరును విడమరిచి చెప్పి ఓటర్లలో అవగాహన కల్పించేందుకు ఆ పార్టీ నాయకులు పెద్దఎత్తున ప్రచారం మొదలు పెట్టారు. బేబీనాయన పూర్తి పేరు రావు వెంకట శ్వేతాచలపతి కుమార్‌కృష్ణ రంగారావు. చిన్నప్పటి నుంచి వారి ఇంట్లో, బయట ప్రజలు అందరూ బేబీనాయన అని పిలవడంతో ఆ పేరే ఆయనకు స్థిరపడిపోయింది.



ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన)

1989 నుంచి డబ్బులు పంపకం

పెద్దల మాట

శృంగవరపుకోట: ఓటుకు డబ్బులు పంచే సంస్కృతి 1989 నుంచి మొదలైంది. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారు. 1983లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించారు. అప్పటి గవర్నర్ సాయంతో ఎన్టీఆర్‌ను గద్దె దించి నాదెండ్ల భాస్కరరావు ముఖ్యమంత్రి అయ్యారు. 1985లో తిరిగి ఉప ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్, టీడీపీ, ఇతర పార్టీలు ఎన్నికల ప్రచారాలు నిర్వహించాయి. ఓటరుకు ఒక్క పైసా ఎవరూ ఇవ్వలేదు. అంతా స్వచ్ఛందంగానే ఓటేశారు. టీడీపీ మళ్లీ గెలిచింది. టీడీపీని ఓడించడం కష్టమని భావించిన అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ 1989లో ఓటరుకు డబ్బులు అలవాటు చేసింది. అక్కడి నుంచి ఒకరిని చూసి ఒకరు ఇలా పార్టీలన్నీ డబ్బులు పంచుతున్నాయి. శ్రుతిమించి ఓటరును ప్రలోభ పెడుతున్నారు.

- కొణదం మల్లేశ్వరరావు (78), శృంగవరపుకోట పట్టణం



ఎన్నికల ఖర్చంతా వీఆర్వోలపైనే

- అప్పు చేసి భరిస్తున్నాం
- ఎన్నికలయ్యాక చేతికందని నగదు
- గత ఎన్నికల్లో పరిస్థితి ఇదే
- ఆదుకోవాలంటూ ఈసీకి విజ్ఞప్తి

(గరుగుబిల్లి)



సాధారణంగా ఎన్నికల ఖర్చుకు సంబంధించిన డబ్బును ఆర్వోలు, వీఆర్వోలు, ఏఈఆర్వోలు విడుదల చేస్తుంటారు. ఆర్వోల నుంచి ఏఈఆర్వోలు, వీఆర్వోలకు సొమ్ము విడుదలవుతుంటుంది. వీరిలో సాధారణంగా తహసీల్దారులే ఉంటారు. తహసీల్దారులు తిరిగి ఆర్‌ఐలకు పనులు పురమాయిస్తారు. ఆర్‌ఐలు ఆ పనులను వీఆర్వోలపై పెడతారు. అంతిమంగా ఆ ఖర్చు వీఆర్వోల మెడకు చుట్టుకుంటుంది. చాలా చోట్ల వీఆర్వోలు, బీఎల్‌వో లుగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వీరంతా రూ.లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. ఇందుకోసం అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం నుంచి నిధులు ఏమీ రాకపోవడంతో ఎన్నికలయ్యే వరకు ఓపిక పట్టాలి. అప్పులు ఇచ్చిన వారిని బతిమిలాడుకుంటున్నారు. ఎన్నికల ప్రక్రియకు అవసరమయ్యే స్టేషనరీ, పేపర్ బండిల్స్, దరఖాస్తులు, ప్రింటింగ్ కాపీలు, ఎలక్టోరల్ రోల్స్, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, ర్యాంపులు, కేంద్రాల్లో పరిశుభ్రత, ఇవన్నీ వీఆర్వోలే చూసుకోవాలి. జిల్లా ఎన్నికల అధికారి, ఆర్వోలు వస్తే ప్రోటోకాల్ ప్రకారం వారి ఖర్చులన్నీ భరించాలి. పోలింగ్ సమయంలో భారీగా ఖర్చు ఉంటుంది. ఒక్కో మండలానికి సగటున 60 పోలింగ్ కేంద్రాలు ఉంటాయనుకుంటే... ఒక్కో కేంద్రానికి 12 మంది సిబ్బంది ఉంటారు. అన్ని పోలింగ్ స్టేషన్లకు అల్పాహారం, భోజనాలు, స్నాక్స్, మజ్జిగ వంటివి ఏర్పాటు చేయాలి. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలకు చేరుకునే సిబ్బందికి అల్పాహారాలు, భోజనాలు పెట్టాలి. ఇలా లక్షల రూపాయలను ఖర్చు చేసినా చివరకు ఆ డబ్బు చేతికి అందక వీఆర్వోలు ప్రతి ఎన్నికల్లో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఎన్నికల సందర్భంలో ఇతర జిల్లాల తహసీల్దారులు బదిలీపై వస్తుంటారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన డబ్బు వీరు తీసుకు వెళ్లిపోతూ ఉండటంతో వీఆర్వోలు నిండా మునిగిపోతున్నారు. గత ఎన్నికల్లోనూ ఇదే తంతు జరిగింది. ఎన్నికల్లో డబ్బు ఖర్చు పెట్టే వారికే ఎన్నికల సంఘం ఆ మొత్తం ఇవ్వాలని వీఆర్వోలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో పడిన ఇబ్బందులు, ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలను వీఆర్వోల సంఘం నాయకులు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతున్నారు.


బీఎల్‌వోలకు గౌరవ వేతనం లేదు

బీఎల్‌వోలకు గత ఎన్నికల సమయంలోనూ గౌరవ వేతనం ఇవ్వలేదు. ఆ నిధులు తక్షణమే విడుదల చేయాలి. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లాం. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఆ నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగానికి రిటర్నింగ్ అధికారి పరిధిలో చర్యలు తీసుకోవాలి.

- మరడ సింహాచలంనాయుడు,
జిల్లా వీఆర్వోల సంఘ అధ్యక్షుడు, పార్వతీపురం

నాడు శ్రీకాకుళం నేడు విజయనగరం

- మారిన రాజాం
- కొత్త జిల్లాలో తొలి ఎన్నికలు
- ఏడు దశాబ్దాల అనుబంధానికి చెల్లుచీటీ



రాజాం నియోజకవర్గం మ్యాప్

(రాజాం రూరల్)

రాజాం.. ప్రపంచ పారిశ్రామిక చిత్రపటంలో సుస్థిరస్థానం.. చారిత్రకంగా పౌరుషానికి మారుపేరైన బొబ్బిలి రాజుల ప్రతినిధి తాండ్ర పాపారాయుడు నడయాడిన నేల.. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థలు ఉన్న నగరం.. రాజకీయంగా ఉద్దండపిండాల నిలయం. ఏడు దశాబ్దాల పాటు శ్రీకాకుళం జిల్లా ప్రజలతో మమేకమైన పట్టణం. తొలినాళ్లలో పేరుకు ఉణుకూరు నియోజకవర్గమైనా రాజకీయాలకు గుండెకాయ వంటి స్థలం. అనూహ్యంగా రెండేళ్ల క్రితం హద్దులు... సరిహద్దులు మార్చుకుని శ్రీకాకుళంతో అనుబంధానికి చెల్లుచీటీ ఇచ్చి.. విజయనగరం జిల్లాతో కొత్త బంధం ఏర్పరచుకున్న కేంద్రం.. వచ్చేనెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో తొలిసారిగా కొత్త జిల్లాలో ఎన్నికలకు సిద్ధం అవుతున్న నాయకులు, ప్రజలకు కేంద్ర బిందువైన నియోజకవర్గం.

ఏడు దశాబ్దాల క్రితం

1950 ఆగస్టు 15న శ్రీకాకుళం జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఎన్నికలు జరిగినప్పుడల్లా రాజాంకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఉణుకూరు నియోకవర్గం నుంచి పాలవలస సంగంనాయుడు, ఆయన భార్య పాలవలస రుక్మిణమ్మ, వారి కుమారుడు పాలవలస రాజశేఖరం, కిమిడి కళా వెంకటరావు, కిమిడి గణపతిరావు వంటి నేతలు అసెంబ్లీలో అడుగుపెట్టిన ఘన చరిత ఉంది. పేరుకు ఉణుకూరు అయినా రాజకీయ వేదిక రాజాంగానే చెప్పక తప్పదు. తొలిరోజుల నుంచి బీసీలకు కేటాయించిన ఈ నియోజకవర్గం పునర్విభజనలో భాగంగా 2009లో ఎస్సీలకు కేటాయించారు. దీంతో తొలిసారిగా ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి రాజాం వలస వచ్చిన కోండ్రు మురళీమోహన్ కాంగ్రెస్ అభ్యర్థిగా, అక్కడి నుంచే వలస వచ్చిన సీనియర్ నేత, ఫైర్‌బ్రాండ్ కావలి ప్రతిభాభారతి తెలుగు దేశం తరపున ఎన్నికలలో తలపడ్డారు. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో రాజాంలో కోండ్రు మురళీమోహన్ విజయం సాధించారు. తెలుగుదేశం పార్టీ నుంచి ప్రజారాజ్యం పార్టీలోకి.. ఆపై వైఎస్సార్ సీపీలోకి చేరిన కంబాల జోగులు 2014, 19 ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019 ఎన్నికల తరువాత ఏర్పడిన రాజకీయ పరిణామాలు, ఆరోగ్యం దృష్ట్యా ప్రతిభాభారతి ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు. కోండ్రు మురళీమోహన్ ప్రస్తుతం టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

నియోజకవర్గంలో ఓటర్లు ఇలా..

మండలం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
రాజాం	82	38795	38564	12	77371
వంగర	50	17369	17456	2	35097
రేగిడి	75	28537	27701	2	56240
సంతకవిటి	77	28470	28155	3	56628
మొత్తం	284	113441	111876	19	225336



రాజాం పట్టణం

సరిగ్గా రెండేళ్ల క్రితం

సరిగ్గా రెండేళ్ల క్రితం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా మూడు ముక్కలైంది. 2022 ఏప్రిల్ 4న రాజాం నియోజకవర్గం విజయనగరం జిల్లాలో, పాలకొండ నియోజకవర్గం పార్వతీపురం మన్యం జిల్లాలో చేరాయి. మిగిలిన నియోజకవర్గాలు శ్రీకాకుళం జిల్లాలో ఉండిపోయాయి. ఫలితంగా సరిహద్దులు మారాయి. రాజకీయంగా జిల్లా ప్రజలతో ఉన్న అనుబంధానికి తెరపడింది. తొలిసారిగా విజయనగరం జిల్లాలో ఎన్నికలకు ఇక్కడి ప్రజలు సిద్ధపడుతున్నారు. ఎలాంటి రాజకీయ అనుభవం లేని పట్టణానికి చెందిన ఓ వైద్యుడు అధికార పార్టీ అభ్యర్థిగా బరిలో దిగి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో 284 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 2,25,336 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,13,441 మంది పురుషులు కాగా... 1,11,876 మంది మహిళలు.

ప్రలోభాలకు గురిచేస్తే.. శిక్ష తప్పదు



- నాయకా.. పారాహుషార్

(కొమరాడ/రాజాం రూరల్)

ఓటర్లను ఇబ్బంది పెట్టినా... ప్రలోభాలకు గురిచేసినా సంబంధిత నాయకులు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియమావళి అమలును కఠినతరం చేశారు. పోటీలో ఉన్న కొన్ని పార్టీల అభ్యర్థులు ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ఓ పక్క ప్రచారం సాగిస్తూ... మరోపక్క ప్రలోభాల ఎర వేయడానికి సమాయత్తమయ్యారు. ఇలా చేయడం నేరం. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, భారత శిక్షాస్మృతి చట్టాల కింద కేసులు నమోదు చేస్తారు. నేరం రుజువైతే జరిమానా లేదా జరిమానాతో పాటు శిక్ష తప్పదు. ప్రలోభాల ఎర ఎలా ఉంటే.. శిక్షలు ఏ విధంగా నమోదవుతాయన్న అంశాలను పరిశీలిద్దాం.

కానుకల పంపిణీ నేరం

ఓటర్లకు నేరుగా ప్రలోభాలకు గురిచేస్తూ కానుకలు పంపిణీ చేయడం నేరం. అన్నదానం, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయకూడదు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఐపీసీ 171(ఇ) చట్టం కింద శిక్షార్హులవుతారు.

డబ్బులు పంచితే

ఓటర్లను తమ వైపునకు తిప్పుకొనేందుకు అభ్యర్థులు నగదు ఎరగా వేస్తారు. అక్రమ చెల్లింపులు పలు రకాలుగా పంపిణీ చేస్తుంటారు. ఇలా చేస్తే ఐపీసీ 171(హెచ్) కింద చర్యలు ఉంటాయి. అధికారులకు లంచం రూపంలో డబ్బులు ఇచ్చినా... ఓటర్లకు డబ్బులు పంచినా ఐపీసీ 171(బి) సెక్షన్ కింద చర్యలు తీసుకుంటారు.

రెచ్చగొట్టినా.. కించపరిచినా

ఓట్ల కోసం కులం, మతం, సామాజిక వర్గాలను రెచ్చగొట్టేలా పలువురు వ్యాఖ్యలు చేస్తుంటారు. ఎదుటి వ్యక్తుల మనోభావాలను కించపరడం చేస్తారు. ఇలా జరిగితే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 125 కింద కేసు నమోదు చేస్తారు.

ప్రచార సమయం మీరొద్దు

అభ్యర్థులకు కేటాయించిన సమయాన్నే వినియోగించుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా మైకులు, డీజేలు, వివిధ రకాల ప్రచార సామగ్రి వినియోగించకూడదు. దీనికి ఐపీసీ 171(ఎఫ్) చట్టం కింద చర్యలు తీసుకుంటారు.

మరికొన్ని శిక్షలు ఇలా..

- సెక్షన్ 128: ఎన్నికల విధుల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికలకు సంబంధించిన విషయాలను రహస్యంగా ఉంచాలి.. ఉల్లంఘిస్తే మూడు నెలల జైలుశిక్ష.
- సెక్షన్ 129: విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఏపార్టీ అభ్యర్థికైనా అనుకూలంగా వ్యవహరించడం నేరం. ఈ నిబంధన అతిక్రమిస్తే ఆరు నెలలు జైలుశిక్ష.
- సెక్షన్ 130: పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలోపు ప్రచారం నిర్వహించడం, ఓటర్లను అభ్యర్థించడం, ఇతర పార్టీ అభ్యర్థులకు ఓటు వెయ్యొద్దని సూచించడం కూడా నేరమే.
- సెక్షన్ 131: పోలింగ్ స్టేషన్‌లో ఉన్న వ్యక్తులకు, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి ఆగ్రహం తెప్పించేలా లౌడ్‌స్పీకర్లు, ఇతరత్రా సాధనాల ద్వారా ధ్వనులు చేయడం నిషేధం. అలాంటి దుశ్చర్యలకు పాల్పడే వ్యక్తులను అరెస్ట్ చేయాల్సిందిగా ప్రిసైడింగ్ అధికారులు పోలీసులకు సూచించవచ్చు. ఇలాంటి నిందితులకు మూడు నెలల జైలు, జరిమానా లేదా రెండూ విధించే అవకాశాలు ఉన్నాయి.
- సెక్షన్ 132: పోలింగ్ కేంద్రంలో చట్టవిరుద్ధంగా వ్యవహరించడం, అభ్యంతరకరంగా ప్రవర్తించడం, వివాదాస్పదంగా వ్యవహరించడం నేరం..అలాంటి వారిని అరెస్ట్ చేయాలని సూచించే అధికారం ప్రిసైడింగ్ అధికారులకు ఉంది. అలాంటి నేరాలకు మూడు నెలల జైలుశిక్ష.
- సెక్షన్ 133: ఎన్నికల రోజున ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించడం నేరం. ఎవరైనా వాహనాన్ని అద్దెకు తీసుకుని ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలిస్తే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు సంబంధితపార్టీ వ్యక్తులకు శిక్ష పడుతుంది. మూడు నెలల వరకూ జైలుశిక్ష పడే వీలుంది.
- సెక్షన్ 135: పోలింగ్ కేంద్రం నుంచి ఎన్నికలకు సంబంధించిన పరికరాలను పట్టుకెళ్లేందుకు ప్రయత్నించడం నేరం. అలాంటి చర్యలకు ఇతరులను ప్రోత్సహించడం కూడా నేరమే. ఈ తరహా నేరానికి ఏడాది వరకు జైలుశిక్ష.
- సెక్షన్ 135 (ఎ): బూత్ క్యాప్చరింగ్‌లకు పాల్పడడం... పోలింగ్ కేంద్రాలను ఆక్రమించడం, ఓటర్లను పోలింగ్ కేంద్రంలోనికి వెళ్లకుండా బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటి అరాచకాలకు పాల్పడితే నిందితులతో పాటు వారిని ప్రోత్సహించిన వారికి కూడా అయిదేళ్ల జైలుశిక్ష, జరిమానా తప్పనిసరి..
- సెక్షన్ 135 (సి): ఎన్నికలకు 48 గంటల ముందు నుంచి మద్యాన్ని పంపిణీ చేయడం నేరం. అమ్మకాలు కూడా నిషిద్ధం. దీనికి ఆరునెలల జైలు... రూ.రెండువేల జరిమానా విధించే అవకాశం కూడా ఉంది.
- సెక్షన్ 153 (ఎ): వివిధ వర్గాలు, గ్రూపు మధ శత్రుత్వం పెంచేలా వ్యవహరించినా... ప్రసంగించినా శిక్ష తప్పదు.
- సెక్షన్ 171 (బి): ఓటర్లకు డబ్బులిచ్చి ప్రలోభపెట్టాలని చూడడం నేరం.. ఆర్థిక సాయం పేరుతో డబ్బులివ్వడానికి ప్రయత్నిస్తే ఏడాది వరకూ జైలు శిక్ష తప్పదు.

ఓటర్లను బెదిరిస్తే

ప్రతి ఓటరుకు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే హక్కు ఉంది. వారిని ఒత్తిడికి గురిచేయడం... బెదిరించడం తీవ్ర నేరంగా పరిగణిస్తారు. ఇలా చేసినట్టు రుజువైతే బాధ్యులపై ఐపీసీ 171(సి) చట్టం కింద కేసు నమోదు చేస్తారు.



మద్యం సరఫరా చేస్తే

ఎన్నికలు అంటే డబ్బుల తర్వాత గుర్తుకొచ్చేది మద్యం. ప్రతి గ్రామంలోనూ రాజకీయ పక్షాలు మద్యం పంపిణీ చేస్తుంటాయి. నిబంధనల ప్రకారం ఓ వ్యక్తి మూడు సీసాలకు మించి మద్యం తీసుకెళ్లడం నేరం. ఓటర్లకు పంపిణీ చేసేందుకు భారీ మొత్తంలో మద్యం రవాణా చేస్తూ పట్టుబడుతుంటారు. అలాంటి వారిపై అబ్కారీ చట్టం 1968 సెక్షన్ 34(ఎ) కింద కేసు నమోదు చేస్తారు. దీనికి ఆరు నెలల నుంచి ఏడాది వరకు శిక్ష, రూ.5 వేల నుంచి రూ. 20 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.



ఖర్చు తక్కువ చూపుతామంటే కుదరదు

- ఈసీకీ ఓ లెక్కుంది

(సాలూరు రూరల్)

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఖర్చులు తక్కువ చేసి చూపుతామంటే కుదరదు. ప్రస్తుత ధరలను బట్టి ఎన్నికల కమిషన్ దేనికి ఎంత వ్యయమవుతుందో ఓ లెక్కను సిద్ధం చేసుకుంది. ఈ లెక్క ప్రకారం అభ్యర్థులు తమ ఖర్చులను సమర్పించాల్సి ఉంటుంది. ఎన్నికల ప్రచారమంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అభ్యర్థి వెంట అనుచరులు వస్తారు. ప్రచారానికి వెళ్లడానికి వాహనం, అనుచరుల భోజన సదుపాయాలు చేయాల్సిందే. మరో వైపు సభలు, ర్యాలీలు చేస్తే మరింత వ్యయం. వాటికి సంబంధించిన లెక్కలను ఈసీకి అభ్యర్థులు చూపాల్సి ఉంటుంది. వాటర్ ప్యాకెట్ నుంచి సాంబారు ఇడ్లీ, చికెన్ బిర్యానీ, ఎక్కిన వాహనం, పెట్టిన మైక్, కట్టిన బ్యానర్, ఎగిరిన జెండాకు లెక్కలను పక్కాగా ఈసీకి చూపించాల్సిందే. అభ్యర్థుల వ్యయ పరిశీలనకు మండల, నియోజకవర్గ స్థాయిలో ఈసీ పరిశీలకులను నియమించింది.

అభ్యర్థుల వ్యయ పరిమితి

ఎన్నికలల్లో పోటీ చేసిన అభ్యర్థులకు కేంద్ర ఎన్నికల సంఘం వ్యయ పరిమితిని విధించింది. ప్రస్తుత ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గరిష్టంగా రూ.90 లక్షలు ఖర్చు చేసుకోవచ్చు. ఎమ్మెల్యే అభ్యర్థి గరిష్టంగా రూ.40 లక్షల వ్యయం చేసుకోవచ్చు. ఎన్నికల్లో ఈసీ పరిమితి కంటే ఎక్కువగానే అభ్యర్థులు ఖర్చు చేస్తారనేది బహిరంగ రహస్యం. ఈసీకి లెక్కలు మాత్రం పరిమితి కంటే కనీసం ఐదారు లక్షల రూపాయలు తక్కువగానే చూపిస్తారు. ఎన్నికల లెక్కలు రాయడంలో ప్రతి నియోజకవర్గంలో ఆరితేరిన చిత్రగుప్తులు ఇందుకు ప్రత్యేకంగా ఉన్నారు. వారి ద్వారానే అభ్యర్థులు ఈసీకి ఇచ్చే లెక్కలను రాయిస్తారు.

ఇలా ఖర్చు చేయాలి

కోలాటానికి రూ.5000, డ్రమ్స్ లేదా బ్యాండ్ రూ.1000, లైట్స్ రూ.300 (రోజుకు లెక్కన), ఎనిమిది అడుగుల జెండా రూ.1500, వీడియోగ్రాఫర్‌కు రూ. 5000, పువ్వులకు రూ.350, సౌండ్ బాక్స్‌లకు రూ.2000, పూల బోకేకు రూ.500, కరపత్రాలు వందకు రూ.600, బిస్కెట్ ప్యాకెట్‌కు రూ.40, వెజిటేరియన్ భోజనం రూ.100, నాన్ వేజ్ భోజనం లేదా బిర్యానీ రూ.150, పూరి రూ.40, టీ రూ.10, బస్సుకు రూ.20,000, వివిధ వాహనాలకు వివిధ రేట్లు ఉన్నాయి. డ్రైవర్‌కు రోజుకు భత్యం రూ. 520... ఇలా ప్రతి దానికీ ఈసీకి ఓ లెక్క ఉంది. దానిని బట్టి ఖర్చులు సమర్పించాల్సి ఉంటుంది.





మా ఓటు మాటేమిటి సార్?

● ఎన్నికల విధుల్లో ఫొటో, వీడియో గ్రాఫర్లు

(గరుగుబిల్లి)

ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ నేతలపై ఎన్నికల సంఘం నిఘా వేసింది. అందుకు అధికారులూ ఉన్నారు. ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లతో ఎన్నికల ప్రచార శైలిపై ఫొటోలు, వీడియోలు తీయిస్తున్నారు. ఎన్నికల అధికారుల వెంట ఉండే ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందా? నియోజకవర్గానికి సుమారు 70 మంది వీడియో గ్రాఫర్లను ఎన్నికల అధికారులు పనిలో ఉంచుకున్నారు. వారంతా ఓటు హక్కు వదులుకునే పరిస్థితి కనిపి స్తోంది. ప్రజా స్వామ్యంలో ఓటు వజ్రాయుధం... ఓటు హక్కు తప్పని సరిగా వినియో గించుకోవాలని ఊదరగొట్టే అధికారులు తమ వెంట ఉండే సిబ్బంది, పనిలో ఉన్న వారందరితో ఓటు వేయిస్తారో.. లేదో..?

ఫొటోలన్నీ సామాజిక మాధ్యమాల్లో పెట్టొద్దు

మీకు తెలుసా

శృంగవరపుకోట: స్మార్ట్ ఫోన్లు వచ్చిన తరువాత ప్రతిదీ ఫొటో తీసేస్తున్నాం. సామాజిక మాధ్యమాల్లో పెట్టేస్తున్నాం. ఇప్పుడీ సార్వత్రిక ఎన్నికల సమయంలో మాత్రం తీసిన ప్రతి ఫొటో సామాజిక మాధ్యమాల్లో పెట్టడం చట్ట విరుద్ధం. దీన్ని అతిక్రమించి నిబంధనలకు విరుద్ధంగా ఫొటోలు పెడితే ఎన్నికల సంఘం తీసుకోనే చర్యలకు సిద్ధం కావాల్సిందే. ఓటు వేసే సమయంలో తెలిసో తెలియకో సెల్ఫీ తీసుకుంటే ఎన్నికల నియమావళి 49ఎం (ఓటు రహస్యం) ప్రకారం నేరం. చట్టప్రకారం ఆ ఓటరును బయటకు పంపించేస్తారు. ఆ ఓటును 17ఏలో నమోదు చేస్తారు. ఓట్లు లెక్కించేటప్పుడు పరిగణనలోకి తీసుకోరు.



అది రాజకీయ రణక్షేత్రం

బొబ్బిలి పేరు చెబితే రాజరికం... అప్పటి ఎత్తులు... పైఎత్తులు... యుద్ధాలు గుర్తుకు వస్తాయి. ఇప్పుడు అదే నియోజకవర్గంలో భాగమైన తెర్లాం ఒకప్పుడు నియోజకవర్గ కేంద్రం. తెర్లాం నియోజకవర్గం పేరు చెబితే రాజకీయ రణరంగం గుర్తుకు వస్తుంది. అక్కడ రెండు కుటుంబాల ప్రాబల్యం కనిపించేది. నిత్యం రాజకీయ యుద్ధ వాతావరణం నెలకొనేది.

● ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటి మీదకు వాలేది కాదు
● రాజకీయ పార్టీల ప్రాబల్యం నామమాత్రమే
● తెంటు-వాసిరెడ్డి మాటే వేదవాక్కు
● ఇదీ నాటి తెర్లాం నియోజకవర్గంలో పరిస్థితి

(బొబ్బిలి)

ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటి మీద వాలినా సహించలేని రీతిలో అక్కడ రాజకీయం సాగేది. ఒకే రక్తం పంచుకుని పుట్టిన సొంత అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు సైతం ఆ గ్రామాలలో చెరో పక్క ఉంటే... వారి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉండేది. 1978 నుంచి 2008 వరకు రాష్ట్ర స్థాయిలో ఓ ప్రత్యేకమైన ఉనికిని చాటుకున్న ఒకప్పటి తెర్లాం అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఇది. ఒళ్లు గగుర్పాటు కలిగించే విధంగా అక్కడ రాజకీయ పరిస్థితులు ఉండేవి. ఆ నియోజకవర్గంలో రాజకీయ పార్టీల ప్రాబల్యం అంతంత మాత్రమే. తెంటు-వాసిరెడ్డి కుటుంబాల హవాయే సాగేది. వారికి చురకత్తుల్లాంటి వీరాభిమానులు ఉండేవారు. తమ అధినేత ఏది చెబితే అది అక్షరాలా చేసి చూపించే వారు. నాయకుల మాట వేదవాక్కుగా భావించి ఒక్కోసారి రక్తసంబంధాలను కూడా వదులుకునేవారు. సుమారు మూడు దశాబ్దాల పాటు మనుగడ సాగించిన తెర్లాం నియోజకవర్గంలో తెంటు-వాసిరెడ్డి కుటుంబాల వారు చిరకాల ప్రత్యర్థులు. వాసిరెడ్డి వరదరామారావుపై తెంటు జయప్రకాశ్ తెలుగుదేశం తరఫున పోటీ చేసి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఒక్కసారి మాత్రమే జయప్రకాశ్ ఓటమి చెందారు.

● తెంటు జయప్రకాశ్ తండ్రి లక్ష్మునాయుడు 1978లో జనతా పార్టీ తరఫున పోటీ చేశారు. ఆయనపై ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరఫున (ఆవు-దూడ గుర్తుపై) పోటీ చేసిన వాసిరెడ్డి వరదరామారావు అప్పట్లో గెలుపొందారు. తెర్లాం నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా గెలుపొందిన వాసిరెడ్డి.. ఆ తరువాత వరుసగా జయప్రకాశ్ చేతిలో ఓటమి చవిచూశారు. 1999లో వాసిరెడ్డి ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగా తెంటు జయప్రకాశ్‌పై పోటీ చేసి గెలుపొందారు.

● 2004లో మళ్లీ టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన జయప్రకాశ్ అనారోగ్యంతో 2006లో కన్నుమూశారు. ఆ తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో జయప్రకాశ్ తనయుడు లక్ష్మునాయుడు (రాజా) తెలుగుదేశం తరఫున పోటీ చేసి గెలుపొందారు. అప్పట్లో వాసిరెడ్డి పోటీ చేయకుండా ఉండిపోయారు. లోకసత్తా తరఫున రెడ్డి లక్ష్మునాయుడు, ఇండిపెండెంట్లుగా గుడివాడ మహేశ్, ఏగోటి సింహాచలం ఉప ఎన్నికల్లో పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో రాజాకు 74.39 శాతం ఓట్లు వచ్చాయి. ఆ నియోజకవర్గానికి అవే ఆఖరి ఎన్నికలు కావడం గమనార్హం.

● తెంటు-వాసిరెడ్డిలకు ఎన్నికల్లో ఊరూరా అభిమాన గణం బ్రహ్మరథం పట్టేవారు. ప్రతీ గ్రామంలోనూ వీరిద్దరికీ కరెన్సీ నోట్ల దండలను మెడలో వేసి విరాళాలుగా సమర్పించేవారు. కొన్ని సందర్భాలలో అభ్యర్థులకు ఎన్నికల ఖర్చు పెద్దగా అయ్యేది కాదు.

● వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు పలువురి కేబినెట్‌లలో కీలక మంత్రిగా పనిచేసి బొబ్బిలి ప్రాంతానికి కావల్సిన అనేక ఇరిగేషన్, విద్యుత్ ప్రాజెక్టులను మంజూరు చేయించారు. బొబ్బిలి నుంచి 1983లో కాంగ్రెస్ తరఫున పోటీ చేశారు. ఎన్టీఆర్ ప్రభంజనంలో పరాజయం పొందారు. ఆయన తనయుడు వాసిరెడ్డి వరద రామారావు తెర్లాం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, డీసీసీబీ ఛైర్మన్‌గా, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్‌గా పదవులు నిర్వహించారు.

● వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు - తెంటు లక్ష్మునాయుడు సీనియర్‌లు మంచి మిత్రులుగా ఉండేవారు. బంధుత్వం నెరిపేవారు. ఆ తరువాత కాలంలో రాజకీయంగా ఆ రెండు కుటుంబాలు బద్ధశత్రువులుగా మారిపోయాయి. తెంటు లక్ష్మునాయుడు కుమారుడు జయప్రకాశ్, మనవడు లక్ష్మునాయుడు (రాజా)లు వాసిరెడ్డి ప్రత్యర్థులుగా రాజకీయాలు చేస్తున్నారు. ఇప్పుడు మూడోతరం యువకులు ఈ రెండు కుటుంబాలలో ఉన్నారు. నాటి కక్షలు, పగలు నేడు లేకపోయినప్పటికీ రాజకీయంగా చెరో పార్టీలో కొనసా గుతున్నారు. జయప్రకాశ్ తనయుడు లక్ష్మునా యుడు (రాజా) ఉప ఎన్నికల్లో ఒక విడత ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తరువాత బొబ్బిలిలో విలీనం కావడంతో ఆర్‌వీ సుజయ్ కృష్ణరంగారావు చేతిలో ఓటమి చెందారు. 2014లో టీడీపీ అధికారంలోనికి వచ్చిన తరువాత లక్ష్మునాయుడు కొత్తగా ఏర్పాటైన బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా) ఛైర్మన్‌గా నియమితులయ్యారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోనికి రావడంతో తెంటు ఆ పదవిని వదులుకోవాల్సి వచ్చింది.



తెర్లాం గ్రామం

తెర్లాం ఎమ్మెల్యేలుగా..

1978లో నూతనంగా ఏర్పాటైన తెర్లాం నియోజకవర్గానికి మొదటి ఎమ్మెల్యేగా వాసిరెడ్డి వరదారామారావు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరుపున ఆవు-దూడ గుర్తుపై గెలుపొందారు. తెంటు లక్ష్మునాయుడు (సీనియర్) అప్పట్లో జనతా పార్టీ తరఫున పోటీ చేశారు.

● 1983, 1985, 1989, 1994, 2004: తెంటు జయప్రకాశ్ (తెలుగుదేశం పార్టీ)
● 1999లో వాసిరెడ్డి వరదరామారావు (కాంగ్రెస్-ఐ)
● తెర్లాం ఉప ఎన్నికల్లో తెంటు లక్ష్మునాయుడు (జూనియర్) గెలుపు
● 2009 ఎన్నికల నుంచి తెర్లాం అసెంబ్లీ కనుమరుగై బొబ్బిలి అసెంబ్లీలో కలిసిపోయింది.



తెంటు లక్ష్మునాయుడు (సీనియర్)



వాసిరెడ్డి వరద రామారావు



తెంటు జయప్రకాశ్



తెంటు లక్ష్మునాయుడు (జూనియర్)



వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు

కాలంతోపాటే మారిపోయారు!

● గతంలో డబ్బులు, మద్యం పంచేవారు కాదు
● పార్టీపై అభిమానం.. నాయకుడిపై నమ్మకం
● ప్రస్తుతం మారిన పరిస్థితి



విజయనగరం: రెండు దశాబ్దాల కిందట వరకూ ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బుల పంపకాలు లేవు. యథేచ్ఛగా మందు పంపిణీ లేదు. సగటు పౌరుడిలో పార్టీ మీద అభిమానం, నాయకుడి మీద నమ్మకం కొట్టొచ్చినట్లు కనిపించేది. ప్రజాస్వామ్యంపై అపార గౌరవం ఉండేది. నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే మంచి జరుగుతుందన్న విశ్వాసం కనిపించేది. పార్టీ పిలుపు కోసం అహర్నిశలు పాటుపడే మనస్తత్వం ఎక్కువ మందిలో ఉండేది. ఆ రోజుల్లో రవాణా సదుపాయాలు లేకపోయినా, కాలినడకన వాగులు.. వంకలు దాటుకుంటూ ప్రచారం చేసేవారు. ఈ క్రమంలో గెలిస్తే సంతో షం, ఓడిపోతే మలిదశలో విజయం సాధించాలనే తాపత్రయం కనిపించేది. ఇటు వంటి కార్యకర్తలు, వారి నమ్మ కాన్ని చూరగొన్న నాయకులు ప్రస్తుతం కనుమరుగయ్యారు. ప్రస్తుతం ఓటరు మనస్సులు సమూలంగా మారిపోయాయి. నాయకులకు నాడి కూడా అంతుపట్టడం లేదు.

పరిస్థితులు పూర్తిగా మారిపోయాయ్

ప్రస్తుతం రాజకీయాల్లో పరిస్థితులు పూర్తిగా భిన్నంగా కనిపిస్తున్నాయి. అంతా కిరాయి వ్యవహారంగా మారిపోయింది. పార్టీలు, జెండాలు నాయకులు ఇచ్చే ప్రసంగాలు మారుతు న్నాయి. ఏ ఎండకు ఆ గొడుగులా ఏ పార్టీకి జెండాలు, విధానాలు మారిపోతున్నాయి. నాటి రోజుల్లో ఓ కట్టుబాటు ఉండేది. ప్రస్తుతం ఎవరు ఎప్పుడు పార్టీలు మారుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. కార్యకర్తలు కూడా నాయకులు కంటే రెండాకులు ఎక్కువే చదివారు. అప్పట్లో ఓ పార్టీకి ఇన్ని ఓట్లు వస్తాయన్న లెక్కకు అంచనా ఉండేది. ఐదో పదో తరగొచ్చు.. పెరగొచ్చు అనుకునేవాళ్లు. ఓటరు నాడి కూడా దొరికేది. కానీ నేడు ఓటరు నాడి పట్టే పరిస్థితులు.. ఇచ్చే డబ్బులపై ఆధారపడుతున్నాయి. ఓట్లకు ఏ నాయకులు ఎన్ని నోట్లు పంచుతారో అన్న అంచనాలు, చర్చలు తప్ప ఎవరు ప్రజలు మేలు కోరే వారు, ఎవరి సత్తా ఎంత అన్న అంశాలపై చర్చించే అవకాశం లేకుండా పోయింది. ఎన్నికల బరిలో దిగే వారు కూడా గెలిచిన తర్వాత ప్రజలను పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. అదే మంటే .. ఊరకనే ఓటు వేశారా.. డబ్బులు తీసుకున్నారు.. ఓట్లు వేశారు.. మళ్లీ ఎలక్షన్ వస్తే ప్రత్య ర్థికంటే అదనంగా సొమ్ములు ఇచ్చి ఓటు కొంటామనే ధోరణి నేటి నాయకుల్లో కనిపిస్తుంది. పార్టీలు మారే నేతలను ప్రజలు ఎంతవరకు నమ్ముతారు. ఆ మార్పులు ప్రజల కోసమా లేక తమ స్వార్థ రాజకీయల కోసమా అనే ఆలోచించే వారు చాలా తక్కువ శాతం ఉన్నారన్నది నగ్న సత్యం. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఎంతో కొంత నమ్మి నాయకులను ఓటు వేసి గెలిపించారు. వారు మాత్రం వారి నమ్మకాన్ని వమ్ము చేశారన్నది సత్యం. అందుకే ఓటర్లూ మారిపోయారు.

నేనూ మీ వాడినే... సాయం చేయండి!

● ఓటర్లకు ఎర వేస్తున్న రాజకీయ పార్టీలు

(విజయనగరం)



సార్వత్రిక ఎన్నికల వేళ రాజకీయ పార్టీ లు ఓటర్లకు అనేకరకాలుగా ఎరలు వేస్తు న్నారు. ముఖ్యంగా వివిధ సామాజికవర్గాల మద్దతు కోసం అన్ని రాజకీయ పార్టీలు హైరానా పడుతున్నాయి. మద్దతు కోసం సామాజికవర్గాల వారీగా రాజకీయ పార్టీలు సమావేశాలు నిర్వహిస్తున్నాయి. అంతే కాకుండా కొన్ని కులాలను బీసీల్లో చేరుస్తామని... మరికొన్ని కులాలను ఓబీసీల్లో చేరుస్తామని చెబుతున్నాయి. ఇప్పటి వరకు బీసీల్లో చేర్చిన ఘనత తమ పార్టీ దేనని నాయకులు హామీల మీద హామీలు గుప్పిస్తున్నారు. ఇదే అదునుగా వివిధ వర్గాల వారు రాజకీయ పార్టీల చుట్టూ తిరుగుతూ హామీలు పొందుతున్నారు. చిన్న, పెద్ద తేడాలేకుండా అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. కొన్ని రాజకీయ పార్టీలు వ్యాపార, వర్తకులకు అనుకూలంగా ఉంటామని చెబుతున్నాయి. ఎటువంటి పరిస్థితుల్లోనైనా తాము అండగా ఉంటామని హామీలు గుప్పిస్తున్నాయి. విందుభోజనాలను సైతం సామాజికవర్గాలకు ప్రత్యేకంగా అందించేందుకు పాకులాడుతున్నారు. ఈ ఎన్నికల్లో కుల సంఘ నాయకులదే ముఖ్య భూమికగా ఉంది. ఈ సమావేశాలను కొందరు బహిరంగంగా... మరికొందరు గోప్యంగా నిర్వహిస్తుండడం విశేషం.

నీరెప్పుడు ఇస్తారో!

మక్కువ: చప్పబుచ్చింపేట పంచాయతీ పరిధిలోని మోసూరువలసలో తాగునీటిని ఇంటింటికీ ఇస్తామని ఐదేళ్లుగా నాయకులు చెబుతున్నారు. కానీ కార్యరూపం దాల్చలేదు. నీటి కోసం గిరిజనులు అవస్థలు పడుతున్నారు. రక్షిత మంచినీటి పథకం పాడై రెండు నెలలు కావస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ నీటి జాడ కానరాలేదు. గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



డమ్మీగా మారిన కొళాయిలు

సామాజిక మాధ్యమాల్లోనూ..

(గరుగుబిల్లి)

ఎన్నికల ప్రచారంలో చేతిలో ఫోన్‌తో చికాకే. మాటి మాటికీ రాజకీయ నేతలు, పోటీలో ఉన్న అభ్యర్థుల ఫోన్ కాల్స్, రికార్డెడ్ వాయిస్‌తో విసిగిస్తున్నారు. సామాజిక మాధ్యమాలలోనూ హోరెత్తిస్తున్నారు. వాట్సాప్ మెసేజ్‌లు, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ మెసేజ్‌లతో కూడా ప్రచారం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థుల ప్రచారం కూడా తోడైంది. నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు ఏదో ఒక రూపంలో 'నేను ఫలానా పార్టీ అభ్యర్థిని, నా ఎన్నిల గుర్తు ఫలానా' అని చెబుతున్నారు. 'మీకు అందుబాటులో ఉండి సేవలందిస్తా. మీ ఓటు వేసి నన్ను గెలిపించండి' అంటూ ఫోన్లలో మోత మోగిస్తున్నారు. ఫోన్ వాయిస్ కాల్స్ ఎక్కువగా వస్తున్నాయి.

వీధుల్లో మైక్‌లు.. ఇళ్లలో సెల్‌ఫోన్లు

● ప్రచారంతో హోరెత్తిస్తున్న అభ్యర్థులు
● విసుగుచెందుతున్న సగటు ఓటరు

(విజయనగరం)

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ పూర్తికావడంతో ప్రచారంపై రాజకీయ పార్టీలు దృష్టిసారించాయి. గతానికి భిన్నంగా పార్టీల అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. వీధుల్లో మైక్‌లతో హోరెత్తిస్తుండగా, ఇళ్లలో ఉండే సెల్‌ఫోన్లకు అభ్యర్థులు ఫోన్ చేస్తున్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికావడం, స్మార్ట్‌ఫోన్లు ప్రతి ఇంటా ఉండడంతో అభ్యర్థులు వాట్సాప్ ద్వారా ప్రతి అంశం షేర్ చేస్తున్నారు. తమకు ఓటు వేస్తే చేయబోయే అంశాలను ఐవీఆర్ ద్వారా వివరిస్తున్నారు. వారంరోజులుగా ఎంపీ, ఎమ్మెల్యేల అభ్యర్థుల తరఫున ఆయా పార్టీల మద్దతుదారులు, పార్టీ కార్యాలయాల ప్రతినిధులు ఫోన్‌చేసి వచ్చే నెల 13న జరిగే పోలింగ్‌లో తమ అభ్యర్థికి ఓటు వేయాలని పదేపదే కోరుతున్నారు. దీనివల్ల ఫోన్‌రింగ్ అవుతున్న సమయంలో లిఫ్ట్ చేసేందుకు చాలామంది ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. గుర్తుతెలియని నంబరు నుంచి ఫోన్ వస్తే లిఫ్ట్ చేయడానికి ఇష్టపడడం లేదు. బంధువులు, స్నేహితులు పను లపై చేసే సమయంలో కూడా ఈ నెంబరు ఎవరిదోనని తికమకప డుతున్నారు. ప్రశాంతతను కోరుకునే గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటారు. కొద్దిరోజులుగా ఎక్కువ సార్లు ఫోన్లు వస్తుండడంతో విసుగు చెందుతున్నారు.



వైసీపీ పాలనలో అన్నీ సమస్యలే: అదితి



పార్టీలో చేరిన వారితో అదితి గజపతిరాజు, కలిశెట్టి అప్పలనాయుడు, టీడీపీ నాయకులు

విజయనగరం రూరల్: విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఐదేళ్ల కాలంలో ఏమీ చేయలేదని, రంగురంగుల విద్యుత్ దీపాలు పెడితే అభివృద్ధి అవుతుందా? అంటూ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు ప్రశ్నించారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆరో డివిజన్ పరిధిలోని సింగపూర్ సిటీ, జమ్ము, సీఆర్ నగర్, ఆనందపురం కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి సమస్య నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఉందని, టీడీపీ అధికారంలోకి రాగానే ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆమె చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు గంటా రవి, ఆరో డివిజన్ నాయకులు కిలారి అప్పారావు, పంచాది శివ, రౌతు పద్మ, రౌతు నర్సింహమూర్తితో పాటు, బీజేపీ, జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ● వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనకు ప్రజలు ముగింపు పలకాలని అదితి గజపతిరాజు చెప్పారు. ఆదివారం ఉదయం పార్టీ కార్యాలయంలో 27వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు వై రమణ, వై సన్యాసమ్మ, వై లక్ష్మీ, వై పైడమ్మ, వై రాముతో పాటు 70 కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. టీడీపీలో చేరిన వారికి పసుపు కండువాలు వేసి అదితి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్‌డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, టీడీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, ప్రజల పక్షమే నిలిచిందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మామిడి రవిశంకర్, దేవరాపల్లి బుజ్జి, కంచుబారికి పైడిరాజు, వై రమణ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

● కూటమి అభ్యర్థి లోకం నాగమాధవి

భోగాపురం: నెల్లిమర్ల నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని కూటమి అభ్యర్థి లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని చోడిపల్లిపేట, చినకొండ్రాజుపాలెం, పెదకొండ్రాజుపాలెం, నందిగాం, ముక్కాం గ్రామాల్లో ఆమె ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేయడంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో గాజు గ్లాసుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తేనే ఆంధ్రరాష్ట్రం బాగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, కర్రోతు సత్యనారాయణ, వరుపుల సుధాకర్, మట్టా అయ్యప్పరెడ్డి, షైలపల్లి అప్పలకొండ, తదితరులు పాల్గొన్నారు.

● ఎన్నికల సమయం సమీపిస్తున్న కొద్దీ జనసేన పార్టీలో చేరికలు ఊపందుకున్నాయి. కొండ్రాజుపాలెం నుంచి 50 కుటుంబాలు, అమటాంరాయవలస నుంచి 100 మంది యువత జనసేన పార్టీలో చేరారు. వీరంతా ఆదివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకుడు ప్రసాదు లోకం ఆధ్వర్యంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. మట్టా అయ్యప్పరెడ్డి, చెల్లుబోయిన నరిశింగరావు, కర్రోతు శ్రీను ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు.



ప్రచారంలో పాల్గొన్న లోకం నాగమాధవి

వైసీపీపై తిరుగుబాటు మొదలైంది: కలిశెట్టి

గుర్ల: ప్రజల్లో వైసీపీ పట్ల తిరుగుబాటు మొదలైందని కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు అన్నారు. మండ లంలోని లావిడము, పెద బంటుపల్లి, రౌతుపేట తదితర గ్రామాల్లో వారు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించా రు. ఈసందర్భంగా కళా మా ట్లాడుతూ నిరంకుశ వైసీపీ పాలనకు చరమగీతం పాడాల న్నారు. ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడు తూ ఒక సామాన్య కుటుంబా నికి చెందిన తనకు టికెట్టు అందించి పార్లమెంట్‌కు పం పించే బాధ్యత ప్రజలపై ఉంచారని ఆయన అన్నారు. అలాగే ఓ పాకలో టిఫిన్ చేస్తున్న చిన్నారులకు తినిపిస్తూ సందడి చేశారు. చిన్నారులకు రాబోయే రోజుల్లో భవిష్యత్తు చూపించే ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు అని వారికి తెలిపారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, జనసేన నాయకుడు శ్రీని వాసరావు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి వి.సన్యాసినాయుడు, సీహెచ్ మహేశ్వరరావు, సన్యాసి నా యుడు, అప్పలనాయుడు, కిలారి సూర్యనారాయణ, జి.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే పెనుబర్తి గ్రామంలో టీడీపీ చీపురుపల్లి బీసీ సెల్ నాయకులు అప్పలనాయుడు, సూర్యారావుల ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. ● పెదబంటుపల్లి, రౌతుపేట, లవి డాము గ్రామాల్లో భారీ స్థాయిలో వైసీపీని విడిచి టీడీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే అభ్యర్థి కళా వెంకటరావు పార్టీలోకి ఆహ్వానించారు.



పాకలో టిఫిన్ చేస్తున్న చిన్నారులతో ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

నెల్లిమర్ల: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల లైన్‌లో చెట్ల తొలగింపు, నిర్వహణ పనుల నిమిత్తం ఈనెల 30వ తేదీన నెల్లిమర్ల మండలం సీతారామునిపేట ఫీడర్ పరిధిలోని గ్రామాలకు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతారామునిపేట, గొర్లెపేట, కొత్తపేట, దీపిల్లిపేట, టొంపలపేట, జగ్గరాజుపేట, దన్నానపేట, కోరాడపేట, కుదిపి, నీలంరాజుపేట, బృందావన్ వ్యాలీ, ఎటి అగ్రహారం గ్రామాల్లోనూ, డి.నెలివాడ, రామతీర్థం గ్రామాల్లోనూ ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

జాతీయ స్థాయిలో పశు వైద్య విద్యార్థుల ప్రతిభ

గరివిడి: ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బెనారస్ హిందూ విద్యాలయం జాతీయ స్థాయిలో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించిన పశు వైద్య చికిత్స విధాన పత్ర సమర్పణ సదస్సులో స్థానిక పశువైద్య కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. పెంపుడు జంతువుల శస్త్ర చికిత్స విభాగంలో ప్రథమ బహుమతిని ఎస్.సృజన, తృతీయ బహుమతిని బి.లక్ష్మీ ప్రసన్న, పెద్ద పశువుల శస్త్ర చికిత్స విభాగంలో రెండో బహుమతిని ఆర్.పూజ, పెంపుడు జంతువుల వైద్య విధాన విభాగంలో జి.భవాని తృతీయ బహుమతిని పొందారు. వీరిని కళాశాల సిబ్బంది అభినందించారు.

కూటమి అభ్యర్థి గెలుపే ధ్యేయం

జామి: మండలంలోని కూటమి అభ్యర్థి కేఏ శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరుతూ జనసేన జిల్లా సమన్వయకర్త మర్రాపు సురేష్, జిల్లా నాయకుడు మిడతాన రవికుమార్ గజపతినగరం పరిధిలో ఉన్న గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధికూలీల వద్దకు వెళ్లి ఈ ప్రభుత్వం చేస్తున్న మోసాలు వివరించారు.

సమన్వయంతో పనిచేద్దాం

దత్తిరాజేరు: సమన్వయంతో పనిచేసి కూటమిని గెలిపిద్దామని టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం చుక్కపేట గ్రామంలో తన నివాసం వద్ద కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పని చేసి, టీడీపీకి పూర్వ వైభవం తీసుకు రావాలని కోరారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బోడసింగి సత్తిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు తథ్యం

బాడంగి: నియోజకవర్గంలో బేబీనాయన అత్యధిక మెజార్టీతో గెలవడం తథ్యమని జిల్లా బీసీ సాధికారిత విజయనగరం పార్లమెంట్ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం సూపర్ సిక్స్ పథకాలను కోడూరులో వివరించారు. బొబ్బిలి నియోజకవర్గంతోపాటు జిల్లాలో అత్యధిక స్థానాల్లో టీడీపీ విజయం తథ్యమని, రాష్ట్రంలో కూడా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరిస్తే మంచిరోజులే

బొబ్బిలి: కాంగ్రెస్ పార్టీని ప్రజలంతా ఆదరిస్తే రాష్ట్రానికి అన్నీ మంచి రోజులేనని బొబ్బిలి అసెంబ్లీకి కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న మరిపి విద్యాసాగర్ (వినయ్) అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని పోల వానివలస, ఐటీఐకాలనీ, ఇందిరమ్మకాలనీ ప్రాంతాల్లో ఇం టింటి ప్రచారం నిర్వహించారు. ఇండియా కూటమి బలప రిచిన కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించాలన్నారు. ముప్వల శ్రీనివాసరావు, పత్రి రాజు తదితరులున్నారు.

ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపండి

జామి: ఓటుతో యువత వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లలితకుమారి కోరారు. ఆదివారం మండలంలోని అలమండ, జాగరం గ్రామాల్లో మండలపార్టీ అధ్యక్షుడు లగుడు రవికుమార్ ఆధ్వర్యంలో ఆమె ప్రచారం నిర్వహించారు.

మనిషి ప్రవర్తన మార్చే గ్రంథం 'నీతిచంద్రిక'

రాజాం: మనిషి ప్రవర్తన మార్చే గ్రంథం నీతిచంద్రిక అని ప్రముఖ సాహితీవేత్త ఒమ్మి రమణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో నేతేటి గణేశ్వరరావు అధ్యక్షతన రాజాం రచయితల వేదిక సమావేశం జరిగింది. ఈ సభలో ప్రధాన వక్తగా ప్రముఖ సాహితీవేత్త ఒమ్మి రమణమూర్తి 'నీతిచంద్రిక- చిన్నయ్య గద్యశైలి' అనే అంశంపై ప్రసంగించారు.

'గురుదేవ' ఆధ్వర్యంలో కాశీ యాత్ర

కొత్తవలస: మండలంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన భజనమండళ్ల సభ్యులు 300 మంది అయోధ్య, కాశీ యాత్రలకు ఆదివారం తరలి వెళ్లారు. చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు జగదీష్‌బాబు నేతృత్వంలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు జగదీష్ బాబు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మండలంలోని భజన మండళ్లకు చెందిన మహిళా సభ్యులను అయోధ్య, కాశీ యాత్రలకు తీసుకెళ్తున్నామన్నారు.

నర్సాపురంలో టీడీపీ ఇంటింటి ప్రచారం

రామభద్రపురం: మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో ఆదివారం తెలుగుదేశం నాయకుడు, నర్సాపురం సర్పంచ్ కోట వెంకటనాయుడు ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. బేబీనాయన, కలిశెట్టి అప్పలనాయుడును గెలిపించాలని కోరారు.

ఎస్సీలకు వైసీపీ తీరని అన్యాయం చేసింది

విజయనగరం రూరల్, ఏప్రిల్ 28: ఐదేళ్ల వైసీపీ పాలన అంతా అస్తవ్యస్తమని, రాష్ట్రం అధోగతి పాలైందని మాదిగ సంఘాల నేతలు ఆర్‌జె ప్రకాష్, బెంజిమెన్, పి రమేష్ మాదిగ అన్నారు. రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా ఆదివారం విజయనగరం వచ్చిన నేతలు, టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. పాదయాత్రలో జగన్ ఎస్సీల సంక్షేమానికి ఎన్నో పథకాలు, హామీలు ఇచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీలు అమలు కాలేదన్నారు. ప్రత్యేక పథకాలు ఏవీ ఎస్సీలకు లేవన్నారు. ఇక టీడీపీ ప్రభుత్వం ఎస్సీల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన పలు పథకాలను రద్దు చేసిందన్నారు. ఎస్సీలపై దాడులు, హత్యలు పెరిగాయన్నారు. మాల, మాదిగలకు జగన్మోహన్‌రెడ్డి తీరని అన్యాయం చేశారన్నారు. ఎస్సీ మహిళలపై అత్యా చారాలు, వేధింపులు జరిగాయన్నారు. ఎస్సీల సంక్షేమం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోటే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకి ఎంతో అవసరమన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే, చంద్రబాబు లాం టి సమర్థవంతమైన నాయకుడు అవసరమన్నారు. టీడీపీ గెలిస్తేనే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని, రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు. కూటమి అభ్యర్థులుగా ఎన్ని కల బరిలో వున్న అదితి గజపతిరాజు, కలిశెట్టి అప్పలనాయుడులకు ఎస్సీ లంతా మద్దతు ఇవ్వాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ ఎస్సీసెల్ నాయకులు మామిడి రవిశంకర్, కండువా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలి

నెల్లిమర్ల: రాష్ట్రంలో అసమర్థ పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు ప్రతిఒక్కరూ నడుంకట్టి పనిచేయాలని కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సు వ్వాడ రవిశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్ల మాట్లాడారు. వైసీపీ పాలనపై ప్రజలు విరక్తితో ఉన్నారని, ఓటుతో జగన్మోహన్‌రెడ్డికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లతోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని అ న్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోలో పస లేదని, చిన్న చిన్న మార్పులతో గత మేనిఫెస్టోనే తిరిగి ప్రకటించారని అన్నారు. చంద్రబాబు రూ పొందించిన సూపర్‌సిక్స్, మహాశక్తి పథకా లకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. చంద్రబాబు గెలుపు తప్పనిసరి అని అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, కడగల ఆనంద్‌కుమార్ ఉన్నారు.

విజయనగరంలో ఎన్నికల పరిశీలకుడు హానీష్ చాబ్రా

విజయనగరం రూరల్, ఏప్రిల్ 28: విజయనగరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడి హోదాలో ఐఏఎస్ అధికారి హనీష్ చాబ్రా శనివారం విజయనగరం చేరుకున్నారు. విజయనగరంలోని వీటి అగ్రహారంతో పాటు, నగరంలోని పలు పోలింగు కేంద్రాలను, కేంద్రాల్లో వున్న ఏర్పాట్లను పరిశీలించారు. అదే విధంగా కౌంటింగ్ కేంద్రాల్లో వున్న వసతులు, ఏర్పాట్ల విషయమై ఆయన పరిశీలించారు. సోమవారం ఉదయం కూడా నగరంలోని పలు ప్రాంతాల్లో పోలింగు కేంద్రాలను, అదే విధంగా కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలను పరిశీలించే అవకాశం ఉంది.

సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

● కలెక్టర్ నాగలక్ష్మి


విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మే, జూన్ నెలలకు సంబంధించి సామాజిక పెన్షన్‌దారులు ఇబ్బందులు పడకుండా తగు ఏర్పాట్లు చేసినట్టు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

● దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు, బెడ్ రిడెన్, చక్రాల కుర్చీకి పరిమితమైన వారి వివరాలు ఇప్పటికే సిద్ధం చేశామని, వీరికి సచివాలయ సిబ్బంది మే 1నే పెన్షన్లు అందజేస్తారన్నారు. ఎవరికి ఈ విధంగా ఇస్తారన్నది ముందుగానే జాబితా విడుదల చేస్తారన్నారు. మిగిలిన వారికి డీబీటీ విధానం ద్వారా వారి అకౌంట్స్‌లోనికి మే 1న పెన్షన్ మొత్తం జమ కానుందని పేర్కొన్నారు.

● ఇంటింటికి పెన్షన్‌లు ఇచ్చే వారి వివరాలు డీబీటీ ద్వారా పెన్షన్ జమ చేసేవారి వివరాలు సచివాలయంలో ఉంచుతారని, గ్రామాల్లో కూడా దీనిపై విస్తృత ప్రచారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ● పెన్షన్ తీసుకోవడానికి ఎవ్వరూ కూడా సచివాలయం లేదా ఏ ఇతర కార్యాలయానికి వెళ్లవలసిన అవసరం లేదని, సామాజిక పెన్షన్‌దారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టరు నాగలక్ష్మి కోరారు.

అబద్ధాలలో ఆస్కార్‌కు జగన్ అర్హుడు: సంధ్యారాణి

మెంటాడ: అబద్ధాలు వల్లించడంలో జగన్‌కు ఆస్కార్ ఇవ్వొచ్చని కూటమి సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని బడేవలస, చల్లపేట గ్రామాల్లో ఆమె ఆదివారం ప్రచారం నిర్వహించారు. వైసీపీ మేనిఫెస్టో ఆ పార్టీ ఓటమిని ముందే సూచిస్తోందని ఆమె ఎద్దేవా చేశారు. మూడు పార్టీల సమన్వయం, ప్రజల ఆశీస్సులతో తప్పక గెలుస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న సంధ్యారాణి

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి: డీఎస్పీ చక్రవర్తి

చీపురుపల్లి: వచ్చే నెల 13న జరగనున్న ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సాయంత్రం చీపురుపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో పిల్లపేట, జి.అగ్రహారం ప్రాంతాలకు చెందిన రాజకీయ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నిల సందర్భంగా లేనిపోని తగాదాల్లో తల దూర్చడం మంచిది కాదన్నారు. ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఐ కె.కిరణ్ కుమార్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం నిలువచేస్తే కేసులు

వంగర: గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం నిలువ చేసి పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని పలుగ్రామాల్లో పర్యటించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం వంగరలో విలేకరుల తో మాట్లాడారు. ఈయన వెంట సిబ్బంది ఉన్నారు. ● **రాజాం:** రాజాం ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని 70 మద్యం కేసులను నమోదు చేసి 78 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది 1-1-24 నుంచి 28-4-2024 వరకు సదరు కేసుల్లో 252.99 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామని, సారాకు సంబంధించి 28 లీటర్లు సీజ్ చేసినట్లు, బెల్లపు ఊటలకు సంబంధించి మూడు కేసులు నమోదు చేసి 2700 లీటర్లు ధ్వంసం చేశామని, నాలుగు మండ లాల్లో 120 మందిని బైండోవర్ చేశామని, 9 ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

ప్రచార వాహనం పక్కకు తీయమన్నందుకు.. ఆటో డ్రైవర్‌పై వలంటీరు దాడి

భోగాపురం: లింగాలవలస గ్రామంలో బాడితబోయిన శ్రీను అనే ఆటో డ్రైవర్‌పై ఓ వలంటీరు, కొంతమంది వ్యక్తులు దాడి చేశారు. బాధితుడు, పోలీసుల వివరాల మేరకు.. లింగాలవలస గ్రామానికి చెందిన బాడితబోయిన శ్రీను భీమిలి పోస్టాఫీసులో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తూ ఖాళీ సమయంలో ఆటో నడుపుకొంటూ జీవనం గడుపుతున్నారు. శుభకార్యం నిమిత్తం పిండి ఆడించడం కోసం ఆదివారం ఆటోలో వస్తుండగా లింగాలవలసలో రహదారిపై అడ్డుగా ఎన్నికల ప్రచార వాహనం ఉంది. దాన్ని తీయమని ఆటో డ్రైవర్ కోరగా.. అక్కడే ఉన్న అదే గ్రామానికి చెందిన వలంటీర్ మునికిషోర్, మరికొందరు శ్రీనుపై దాడి చేశారు. పిడిగుద్దులు గుద్దారు. వలంటీర్ కిషోర్, ముని సన్యాసినాయుడు, ముని సూర్యారావు తనను జెండా కర్రలతో కొట్టారని, దీంతో ముక్కుకు తీవ్రగాయమై రక్తస్రావం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ఐ డి.తాతారావు తెలిపారు. అయితే రహదారికి అడ్డంగా ఉంచిన ప్రచారథం వైసీపీకి చెందినదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం చెప్పేందుకు కూడా ఆటో డ్రైవర్ భయపడుతున్నాడు.

వైద్యుల రక్షణ చట్టాన్ని మెరుగుపరచాలి

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 28: వైద్యుల రక్షణ చట్టాన్ని, ఇండియన్ మెడికల్ సర్వీసును మెరుగుపరచాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ వీ అశోకన్ డిమాండ్ చేశారు. ఆదివారం కంటోన్మెంట్‌లో ఐఎంఏ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అల్లోపతి, హోమియోపతి, ఆయుర్వేద విభాగాలను వేర్వేరుగా పరిగణించాలన్నారు. దేశంలో ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం జీడీపీలో 2.1 శాతంగా వుందని, దీనిని కనీసం 2.5 శాతానికి పెంచాలన్నారు. నేడు వైద్యులు, ఆసుపత్రులపై దాడులు ఆందోళనకరంగా మారాయని, అటువంటి హింసాత్మక చర్యలు అరికట్టడానికి బలమైన చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జేసీ నాయుడు, ప్రతినిధులు జేఏ నాయక్, ఫణిదర్, రవీంద్రనాథ్, రవికృష్ణ, జి.నందకిషోర్, వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోకన్

బొబ్బిలిలో ప్రచారం నిర్వహించిన బేబీనాయన

బొబ్బిలి: బొబ్బిలి ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన ఆదివారం బొబ్బిలి పట్టణంలోని 26 వార్డు స్వామివారివీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తొలుత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఇంటింటి ప్రచారం చేశారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.



స్వామివారివీధిలో ప్రచారంలో బేబీనాయన

వెలమ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం

విజయనగరం రూరల్: నగరంలోని పీవీజీ రాజు క్షత్రియ పరిషత్ కళ్యాణ మండపంలో ఆదివారం వెలమ సంక్షేమ సంఘ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అతిథులుగా ఎన్‌డీఏ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కలిశెట్టి అప్పలనాయుడు, అదితి గజపతిరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైసీపీ ఐదేళ్ల కాలంలో ప్రజా వ్యతిరేక పాలన సాగించిందన్నారు. తాజాగా ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల ఆస్తికి సంబంధించిన రిజిస్టర్ సర్టిఫికేట్ ఒరిజినల్ ప్రభుత్వం వద్ద ఉండిపోతుందని, జెరాక్స్ మాత్రమే సదరు ఆస్తి గల వారికి ఇస్తారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ని గంజాయి రాష్ట్రంగా మార్చారన్నారు. దీని వల్ల ఎంతో మంది యువత జీవితాలు నాశనమౌతున్నాయన్నారు.. టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబు ల్యాండ్ టైటిలింగ్ యాక్టుని రద్దు చేస్తారన్నారు. మే నెల 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు..

అండగా ఉంటా.. ఆశీర్వదించండి: కోండ్రు



వంగర: మరువాడలో ఇంటింటి ప్రచారంలో కోండ్రు

వంగర: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మరువాడ, కింజంగి కోనంగిపాడు, వంగర , మగ్గురూ తలగాం, సీతారాంపురం, మడ్డువలసలో తెలుగుదేశం ఉమ్మడి అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టోను చంద్రబాబు తప్పకుండా అమలు చేస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ ప్రజలను నిలువునా ముంచాడని, ప్రతి వ్యక్తికి అప్పులభారం మోపి ఇబ్బందుల్లో నెట్టాడన్నారు. టీడీపీ నాయకులు బొత్సవాసుదేవరావు నాయుడు, పైలవెంకటరమణ, ఎల్.కృష్ణమూర్తి ధనలక్ష్మి, శ్రీను, రవి, త్రినాథ గణపతి తో పాటు పలువురు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజాం: టీడీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఆదివారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో ఆగూరు పంచాయతీ పరిధిలోని అమరాం గ్రామానికి చెందిన 20 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలన్నారు. టీడీపీ గెలిచి చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. లేదంటే ప్రజలంతా మళ్లీ అంధకారంలో బతకాల్సిందేనని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీకి చెందిన కుప్పిలి అప్పారావు, అ లుగోలు రామారావు, రమేష్, సింహాచలం తదితరులున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ఎస్ చంద్రమోహన్, గురవాన నారాయణ రావు, కడగల అప్పలనాయుడు తదితరులున్నారు.

వైసీపీని వీడి... టీడీపీలోకి..

శృంగవరపుకోట రూరల్: ముషిడిపల్లి గ్రామంనుంచి వైసీపీలో కీలకంగా వున్న మాజీ సర్పంచ్ ముత్యాల సన్యాసమ్మ, ఆమె కుమారుడు సన్యాసిరావు, మాజీ ఎంపీటీసీ ధనలక్ష్మి మరో 30కుటుంబాలు ఆదివారం ఉదయం టీడీపీలో చేరాయి. బొడ్డవరలో ఆమె స్వగృహంలో వైసీపీని వీడినట్లు ప్రకటించి వారంతా సుధారాజు సమక్షంలో టీడీపీలో చేరారు. తమ పంచాయతీ నుంచి తెలుగుదేశంకు అత్యధిక మెజార్టీ ఇస్తామని పేర్కొన్నారు. ● **జామి:** మండలంలోని గజపతినగరం నియోజకవర్గ పరిధిలో కుమరాం గ్రామంలో వైసీపీకి ఎదురుదెబ్బ తగలింది. వైసీపీలో కీలకంగా ఉన్న పల్లి తాత, మహంతి శ్రీను, పిన్నింటి చక్రవర్తి, పిన్నింటి సూరినాయుడు, తదితరులు తమ కుటుంబాలు, మద్దతుదారులతో కలిసి ఆదివారం గ్రామంలో పర్యటించిన కూటమి అభ్యర్థి కేఏ శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ● **రామభద్రపురం:** మండల పరిధిలోని గొల్లలపేట గ్రామంలో 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. జిల్లా బీసీసెల్ ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు ఆధ్వర్యంలో వీరంతా తెలుగుదేశం పార్టీ జోనల్ కోఆర్డినేటర్-2 సుజయ్‌కృష్ణరంగారావు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ● గంట్యాడ: మండలంలోని సిరిపురం, బోనంగి, కొటారుబిల్లి గ్రామాలకు చెందిన పలువురు వైసీపీని వీడి ఆదివారం టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో వీరంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ● దత్తిరాజేరు మండలంలోని గడసాం గ్రామంలో వైసీపీని వీడి 35 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అలాగే 10 కుటుంబాలు జనసేనలో చేరాయి. మరడాం గ్రామం నుంచి పలు కుటుంబాలు టీడీపీలో చేరగా ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ వీరిని ఆహ్వానించారు.

విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడిగా రవిశేఖర్

నెల్లిమర్ల: విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడిగా టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. ఈమేరకు ఆయన విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఆదివారం జరిగిన సమావేశానికి హాజరయ్యారు.

టీడీపీని గెలిపించండి

గరివిడి (మెరకముడిదాం): సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు కోరారు. ఆదివారం గర్భాం మేజర్ పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ గెలిస్తేనే అబివృద్ధి, యువతకు ఉద్యోగాలు సాధ్యమవుతాయన్నారు. తాడ్డి చంద్రశేఖర్, తాడ్డి శ్రీధర్, పల్లెడ బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.